# సభాపతి ప్రసంగం

సభా నాయకులు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి, ప్రతిపక్ష నాయకులు శ్రీ వైఎస్.జగన్మోహన్ రెడ్డి గారికి, మంత్రివర్గ సభ్యులు, శాసన సభ్యులందరికీ శాసనసభకు ఎన్నికైనందుకు ముందుగా మీకందరకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అధికారపక్షం, ప్రతిపక్షం నుంచి మీరందరూ సహకరించి నన్ను ఏకగ్రీవంగా సభాపతిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. నాకు గతం గుర్తుకొస్తుంది, 1983వ సంవత్సరంలో శాసనసభకు ఎన్నికైనప్పుడు మొదటిగా ఇదే చోట సభ సమావేశమైనది. అంతేకాకుండా ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విడిపోయినప్పుడు మొట్టమొదటి శాసనసభ సభాపతిగా నర్సరావుపేట నియోజక వర్గం నుండి శాసనసభ్యునిగా ఎన్నికైన శ్రీ ఎన్. వెంకట రామయ్య చౌదరి గారు ఉన్నారు. అదే విదంగా ఈరోజు సమైక్యాంధ్రప్రదేశ్ నుండి రాష్ట్రం విడిపోయి మొట్టమొదటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాసనసభ సభాపతిగా నేను ఏకగ్రీవంగా ఎన్నికవడం నాఅదృష్టంగా భావిస్తున్నాను. శాసనసభను గురించిగానీ శాసనసభ ప్రాముఖ్యతను గురించి గానీ విశిష్టతను గురించి గానీ, ఎవరు చెప్పాల్సిన అవసరం లేదు. ఈ రాష్ట్రం యొక్క బడ్జెట్ గానీ, ప్రజా సమస్యలపైగానీ, చట్టాల రూపకల్పన గానీ, బిల్లులుగానీ, ప్రభుత్వ జమా ఖర్చుల వివరాల గురించి చర్చ జరిగేది ఈ పవిత్రమైన వేదిక నుంచే. వివిద ప్రాంత ప్రజలకు సంబంధించి మనం చేసే చట్టాలు, బిల్లులు, తీర్మానాలు నిర్దుష్టంగా జరగాల్సిన అవసర ఉంది. ముఖ్యంగా ఈ రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో మనకు జరిగిన అన్యాయం గురించి కానీ, జరిగిన రాజకీయాలపై మాట్లాడాల్సిన అవసరం లేదు.

కానీ మనం నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నాం. మనకు కావల్సిన మౌలిక వసతులుగానీ, నిధులు గానీ, కేంద్రప్రభుత్వం చేసిన వాగ్దానాలు గానీ, వాటిని అమలుచేసే తీరును గానీ వాటన్నింటిని కూడా మనందరం కలిసి సమిష్టిగా పోరాటం చేసి నిర్ణయాలు చేసి సాధించుకుంటే తప్ప ఒనగూరే పరిస్థితులు లేవు. అందుచే నేను కోరేదేమనగా ప్రజా ప్రయోజనాలకు సంబంధించి, ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించి తప్పులు లేకుండా వాటియొక్క కార్యక్రమాలను రూపకల్పన చేసి ప్రజలకు అందించాలని కోరుకుంటున్నాను. ఇంతకు ముందే గౌరవ సభ్యులు చెప్పినట్లు Speaker should speak less and allow others to speak more. If I start speaking more then I am a failure. అలాంటి పరిస్థితి రాకుండా సహకరించమని మిమ్మలందరిని కోరుతున్నాను.

ఈ రోజు సభకు ఎన్నికైన సభ్యుల్లో సుమారు 40మంది కొత్తగా ఎన్నికైనవారు. వారందరు కూడా చట్టాలు గురించి, సభ గురించి, సభా సాంప్రదాయాలు పనితీరు గురించి తెలుసుకోవల్సిన అవసర ఉంది. వారికి సంబంధించి వారికి రావల్సిన బెనిఫిట్స్ గురించి, హక్కులు గురించి తెలుసుకునే విదంగా వారందరిని ఎఫెక్టివ్‌గా పనిచేసే విదంగా చర్యలు తీసుకుంటామని తెలియజేసుకుంటున్నాను. అదేవిదంగా మనం సభలో మాట్లాడే తీరు మనల్ని ఎన్నుకున్న ప్రజలు రాష్ట్ర ప్రజలు మెచ్చుకునే విదంగా ఉండాలి. ప్రజలు లైవ్ టెలికాస్ట్ ద్వారా మనల్ని ప్రతినిమిషం గమనిస్తుంటారు. మనకు గల విషయ పరిజ్ఞానం, హవ భావాలుతో ఏవిదంగా పనిచేస్తున్నామో గమనించే అవగాహనా శక్తి ఈనాటి ప్రజలకుంది. ఇవన్నీ ప్రజలు గమనిస్తుంటారు కాబట్టి వారి పట్ల మీరు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని మనవి చేస్తున్నాను. అధికారపక్షం పైన ప్రతిపక్షం, ప్రతిపక్షం పైన అధికారపక్షం పైచేయిగా ఉండాలని ప్రయత్నించడం సహజమే అయినప్పటికీ, ఆ ప్రయత్నం ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని ప్రజలు హర్షించే విదంగా ఉండాలని కోరుకుంటున్నాను.

ప్రభుత్వం తప్పులుచేస్తే ప్రతిపక్షాలు విమర్శించవచ్చు. ప్రతిపక్ష తీరు బాగులేనప్పడు ప్రభుత్వపక్షం ఎత్తిచూపచ్చు. కానీ ఇంతకు మునుపే గౌరవ సభ్యులు చెప్పినట్లుగా బయట ప్రజలు మనల్ని గురించి అసహ్యహించుకునేటట్లు మనం వ్యవహరించకూడదు. దానిద్వారా శాసనసభ యెక్క స్థాయి, విలువలు తగ్గిపోతాయి కాబట్టి అవిదంగా వ్యవహరించకూడదు. గతంలో మీరు చూసినట్లైతే నేను మొదటిసారి 1983వ సంవత్సరంలో శాసనసభకు వచ్చినప్పుడు సూచించిన పద్దులపై కూలంకషంగా సభలో చర్చ జరిగేది. చర్చానంతరం ఆమోదం జరిగేది. కాలానుగుణంగా పద్దులపై చర్చలు జరగకుండానే చాలా వరకు ముగుస్తున్నాయి. Deemed to have been granted అయిపోతున్నాయి. పద్దులపై చర్చజరిగితే వాస్తవాలు బయటపడతాయని పద్దులన్ని గిలిటెన్ అయ్యిపోతున్నాయి, అది వాంఛనీయం కాదు. సభలో పద్దులపైచర్చ జరిగితేనే ప్రజలకు మంచిది.

మన పనితీరును ప్రజలు మెచ్చుకునే విదంగా పనిచేద్దాం. గౌరవ సభ్యులు మాట్లాడుతూ, అధికార, ప్రతిపక్షాలు రెండూ రెండు కళ్లవంటివి అన్నారు. రాజకీయంగా వేరు కావచ్చు కానీ ఒకసారి సభాపతి స్థానంలో కూర్చున్న తరువాత నా బాధ్యతలు ఏమిటో నేను చేయాల్సిన పనితీరు ఏమిటో నాకు తెలుసు. అదే విదంగా మీరుకూడా హద్దులు మీరకుండా నియమ నిబంధనలు పాటించాల్సి ఉంది. అనేకమంది మనకు ముందు ఈ స్థానాల్లో కూర్చున్నారు. చట్టాలు తెచ్చారు. సాంప్రదాయాలు నెలకొల్పారు, విలువలు పాటించారు. ఆ విలువలును మనం కూడా పాటించినట్లైతే, మన సాంప్రదాయాల్ని పాటించిన

వాళ్లమవుతాము. మన స్థాయి పెరుగుతుంది. మనకున్న ఎమోషన్స్‌ను గానీ, అభిప్రాయాల్ని కానీ వ్యక్తపరచే తీరుతెన్నులు చట్టబద్ధంగానూ, ప్రజలకు మేలు చేసేవిదంగాను ఉండాలని కోరుకుంటున్నాను. ఆ క్రమంలో ఈ రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపు దిద్దుకోవాలంటే మనందరం కలసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

ఈ సభలో రెండోసారి సమావేశమయ్యాము, మొదట ఇక్కడే కూర్చొని కొత్త శాసనసభా హాలులోకి వెళ్లి మళ్లీ ఇక్కడకే వచ్చాం. నేను కోరుకునేదేమనగా వసతులు తక్కువైనా మన రాష్ట్రంలో మన అసెంబ్లీ ఉండాలి, మన సచివాలం ఉండాలి. అతి త్వరలోనే మన ప్రజలకు దగ్గరలోనే మన పరిపాలన ఉండాలని కమిట్‌మెంట్‌తో ప్రజా పరిపాలన ఉండాలని కోరుకుంటున్నాను. సభలో ప్రశ్నావళిపై కూలంకషంగా వివరించేందుకు మంత్రివర్యులు తయారై రావాల్సిందిగా సభ్యులను కోరుకుటున్నాను. నా బాధ్యతలు నిర్వహణలో లోపాలు లేకుండా నిష్పక్షపాతంగా నిర్వహిస్తానని తెలియజేస్తున్నాను. ఈ శాసనసభలో సభాపతిగా పనిచేసే అవకాశం కల్పించిన మీ అందరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియపరుచుకుంటున్నాను.